

ప్రత్యేక రక్షణ చట్టాలు చేయాలి

కోల్‌కతాలో మహిళా వైద్యురాలిపై జరిగిన అత్యాచార ఘటన దారుణం. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు నిందితులను కఠినంగా శిక్షించాలి. ప్రజల ప్రాణాలను కాపాడుతున్న వైద్యుల పట్ల ఇలాంటి క్రూరమైన ఆలోచనలు రావడం బాధాకరం. డాక్టర్లు నిర్భయంగా విధులు నిర్వర్తించేందుకు భరోసా ఇవ్వాలి. ఆస్పత్రుల్లో అన్ని రకాల రక్షణ చర్యలు చేపట్టాలి.

డాక్టర్ బి.మునెయ్య,
విశ్రాంత జోనల్ మలేరియా అధికారి




రక్షణ కల్పించాలి

సేవాదృక్పథంతో డాక్టర్ వృత్తిని ఎంచుకున్న ఆసుపత్రికి వచ్చే వారిని కుటుంబ సభ్యులుగానే భావిస్తూ చికిత్స అందిస్తున్నాం. అలాంటి మాపై క్రూరమైన ఆలోచనలు రావడం బాధాకరం. కోల్‌కతా లాంటి ఘటన మరెక్కడా జరగకుండా ప్రభుత్వాలు గట్టి చర్యలు తీసుకోవాలి. వైద్యులకు రక్షణ కల్పించి భరోసా ఇవ్వాలి. అప్పుడే నిర్భయంగా విధులు నిర్వర్తిస్తారు. రక్షణ కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే.

– డాక్టర్ ఎ.సౌమ్య, వైద్యాధికారి,
కోటవీధి అర్బన్ హెల్త్ సెంటర్, బద్వేలు





పకడ్బందీచర్యలు తీసుకోవాలి

కోల్‌కతాలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన సంఘటన ఘోరమైనది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వాలు పకడ్బందీ చర్యలు తీసుకోవాలి. ఎంతో మంది ప్రాణాలను వైద్యులు కాపాడుతారనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తు పెట్టుకోవాలి. ఈ ఘటనను దృష్టిలో ఉంచుకుని మహిళా డాక్టర్లు, వైద్య సిబ్బందికి భద్రత చర్యలు తీసుకుని, పోలీసులతో రక్షణ కల్పించాలి.

– డాక్టర్ నిఖిల, వైద్యాధికారిణి,
ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, రాజుపాళెం



కఠినమైన చట్టాలు అవసరం

కోల్‌కతా లాంటి అత్యాచార, హత్య ఘటనల్లో నిందితులను కఠినంగా శిక్షించాలి. సంఘటన జరిగిన రోజుల వ్యవధిలోని కఠిన శిక్ష విధించటం వలన మరోసారి ఇలాంటి ఘటనలకు ఎవరైనా పాల్పడాలంటే భయపడతారు. ప్రజల ప్రాణాలను కాపాడే వైద్య సిబ్బందిపై ఎలాంటి ఘాతుకానికి పాల్పడటం దురదృష్టకరం. ఇలాంటి ఘటనలు జరగకుండా వైద్యులకు రక్షణ కల్పించే కఠిన చట్టాలు తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

–మాచనూరు రాఘవయ్య,
మండల ఆరోగ్య విస్తరణాధికారి, చాపాడు

క్లుప్తంగా

రేకుల షెడ్ కూల్చివేత



వీరభద్రాపురం కూల్చివేసిన రేకుల షెడ్

చాపాడు: మండల పరిధిలోని వీరభద్రాపురం వద్ద సర్వే నంబరు 311/ఏ1లో ఉన్న రేకుల షెడ్‌ను బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కూల్చి వేశారని వరికూటి చంద్ర ఓబుళరెడ్డి అనే రైతు తెలిపాడు. తమకున్న 1.10 ఎకరాల భూమిలో 22 సెంట్లతో రేకుల షెడ్‌ను నిర్మించుకున్నామని పేర్కొన్నాడు. అయితే ఈ భూమి ప్రభుత్వ అధీనంలో ఉందని నిర్మాణాలు ఆపాలని రెవెన్యూ అధికారులు చెప్పటంతో నిర్మాణం చేపట్టలేదన్నారు. బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తమ పొలం వద్ద రేకుల షెడ్‌ను కూల్చి వేశారని బాధితుడు తెలిపాడు.

వైభవంగా గ్రామోత్సవం



శ్రీకృష్ణుని గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

కలసపాడు : త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి హిందూ జ్ఞానవేదిక కలసపాడు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో గురువారం శ్రీకృష్ణుని గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శ్రీకృష్ణాష్టమి సందర్భంగా సోమవారం స్థానిక పాత బస్టాండు వద్ద కొలువుదీర్చిన శ్రీకృష్ణుని ప్రతిమకు ప్రతి రోజు ఉదయం, సాయంత్రం పూజలు నిర్వహించి 4వ రోజైన గురువారం మధ్యాహ్నం 2 గంటల నుండిచి సాయంత్రం 5 గంటల వరకు పురవీధుల్లో అంగరంగ వైభవంగా గ్రామోత్సవం నిర్వహించారు. త్రైత సిద్ధాంత ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞానవేదిక కలసపాడు ఉత్సవ కమిటీ, కంభం కమిటీ అధ్యక్షుడు పి.బలరాం, సభ్యులు నర్రా శ్రీనివాసరెడ్డి, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

చెట్లు లేనిదే మనుగడ లేదు

మైదుకూరు : చెట్లు లేనిదే మానవ మనుగడ లేదని వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి, శాస్త్రవేత్త డాక్టర్ ఎం.బాలకృష్ణ అన్నారు. మండలంలోని వనిపెంట కృషి విజ్ఞాన కేంద్రం ఆవరణలో గురువారం అమ్మ పేరుతో మొక్క కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. మొక్కలను పరిరక్షించాలని అప్పుడే పర్యావరణానికి మేలు జరుగుతుందని శాస్త్రవేత్త బాలకృష్ణ సూచించారు. మొక్కలు నాటిన వారిలో కేవీకే శాస్త్రవేత్తలు శ్రీవిద్యారాణి, బీఎస్ కాంతిశ్రీ, ఫిరోజ్ హుస్సేన్ ఉన్నారు.

మద్యం బాటిళ్లు సీజ్

రాజుపాళెం : మండలంలోని గాదెగూడూరు గ్రామానికి చెందిన బింగి ఓబులేసు అక్రమంగా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో అరెస్ట్ చేశామని ఎస్ఐ కత్తి వెంకటరమణ గురువారం తెలిపారు. అతని వద్ద నుంచి 25 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

రోడ్డుపై గుంతలు పూడ్చండి



ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

ప్రొద్దుటూరు : రోడ్డుపై గుంతలను పూడ్చాలని గురువారం స్థానిక అమ్మవారిశాల గవిని సర్కిల్ వద్ద సీపీఎం నాయకులు రోడ్డుపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ బంగారంగళ్ల నుంచి ప్రభుత్వ ఆస్పత్రి మధ్యలో అమ్మవారిశాల వద్ద రోడ్డుపై గుంతలు పడి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ రోడ్డుపై హాస్పిటల్‌కు గర్భిణులు, బాలింతలు, రోగులు వెళుతుంటారన్నారు. అధికారులు గుంతలను పూడ్చి బాగు చేయాలని కోరారు. సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు పక్కీరయ్య, బాలసుబ్బయ్య, మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ముంతాజ్‌బేగం పాల్గొన్నారు.

హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలి

ప్రొద్దుటూరు : రాష్ట్ర వ్యాప్తంగా టైఫాయిడ్, మలేరియా, అతిసార, డెంగీ, చికున్‌గున్యా తదితర వ్యాధులతో ప్రజలు అనారోగ్యంతో బాధపడుతున్నందని రాష్ట్రంలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించాలని ఏపీ దళిత సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు కొత్తపల్లి ఎల్లయ్య ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ప్రతి జిల్లాకు రూ.1,000 కోట్లు కేటాయిస్తూ వెనుకబడిన రాయలసీమ, ఉత్తరాంధ్ర జిల్లాలకు, ఆదివాసీ ఏజెన్సీ ప్రాంతాలకు ప్రజల ప్రాణాల రక్షణకు అదనంగా రూ.2వేల కోట్లు కేటాయించాలని ఆయన పేర్కొన్నారు.

తవ్వుకునోళ్లకు.. తవ్వుకున్నంత..!

నియోజకవర్గంలో ఇసుక అక్రమ దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. తవ్వుకునోళ్లకు.. తవ్వుకున్నంత తీరుగా మారింది. పెన్నా, కుందూనదిలో పాటు వాగులు, వంకల్లో ఇసుక తవ్వేస్తూ ప్రకృతి సంపదను కొల్లగొడుతున్నారు. అక్రమార్కులే ధర నిర్ణయించి లక్షలు గడిస్తున్నారు. రెవెన్యూ, మైనింగ్ శాఖ జరిమానా విధిస్తున్నా.. ఇసుక అక్రమ దందా ఆగడం లేదు.

- క్వారీ లేదు.. డంప్ పెట్టలేదు
- మైదుకూరు నియోజకవర్గంలో యథేచ్ఛగా ఇసుక రవాణా
- జరిమానా విధిస్తున్నా.. ఆగని ఇసుక అక్రమ దందా



చాపాడు పోలీసు స్టేషన్‌లో పట్టుబడిన ఇసుక ట్రాక్టర్లు (ఫైల్)

చాపాడు: ఇసుక కోసం మైదుకూరు నియోజకవర్గ ప్రజలు నానా ఇబ్బందులు పడుతున్నారు. గత నాలుగేళ్లలో వర్షాకాలంలో మైదుకూరులో ఇసుక డంప్ ద్వారా నియోజకవర్గంలోని ఐదు మండలాల వారు అవసరాల మేరకూ ఆన్‌లైన్‌లో డబ్బులు చెల్లించి ఇసుక తెచ్చుకునేవారు. ప్రస్తుతం మైదుకూరులో ఎలాంటి డంప్ ఏర్పాటు చేయలేదు. ఇదే క్రమంలో నియోజకవర్గ పరిధిలో పెన్నానదిలో క్వారీని కూడా ప్రభుత్వం ఏర్పాటు చేయలేదు. దీంతో ఇళ్ల నిర్మించుకునేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతుండగా, పనులు లేక కార్మికులు అవస్థలు పడుతున్నారు.

లక్షలాది రూపాయలు దండుకుంటున్నారు!

నియోజకవర్గంలో చాపాడు, ఖాజీపేట మండలాల్లోని పెన్నానదుల నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్నారు. చాపాడు మండలంలోని తిప్పిరెడ్డిపల్లె, రాజుపాళెం, వెదురూరు, ఖాజీపేట మండలంలో రంగనాయకులతువ్వ, కొమ్మలూరు గ్రామాల నుంచి ఇసుకను ట్రాక్టర్లలో అక్రమంగా తరలిస్తూ డబ్బులు దండుకుంటున్నారు. ఖాజీపేట, చాపాడు మండలాల నుంచి నియోజకవర్గ పరిధిలోని మైదుకూరు, దువ్వూరు, బ్రహ్మంగారిమఠం మండలాలతో పాటు ప్రొద్దుటూరు పట్టణానికి సైతం చాపాడు మండలం నుంచి ఇసుక తరలిస్తున్నారు. ఖాజీపేట, చాపాడు మండలాల నుంచి ఆయా ప్రాంతాలకు దూరాన్ని బట్టి ఇసుక ధరలు నిర్ణయించి యథేచ్ఛగా తరలిస్తున్నారు.

ఇసుక అక్రమ రవాణా

మైదుకూరు నియోజకవర్గంలో ఇసుక అక్రమ రవాణాపై పోలీసులు దాడులు చేస్తున్నప్పటికీ రవాణా ఆగలేదు. చాపాడు మండలంలో ఇటీవల మూడు ట్రాక్టర్లను ఎస్ఐ చిన్న పెద్దయ్య పట్టుకున్నారు. పట్టుబడిన ట్రాక్టర్లను పోలీసులు మండల తహసీల్దార్‌కు అప్పగించారు. ట్రాక్టర్‌కు రూ.8వేలు మాత్రమే జరిమానా వేస్తుండటంతో ఒక రోజులోనే ట్రాక్టర్‌ను బయటికి తెచ్చుకుంటున్నారు. మైనింగ్ శాఖ అధికారులకు అప్పగిస్తున్నప్పటికీ అక్కడ కూడా రూ.11వేలు జరిమానా వేస్తుండగా ఇసుక అక్రమ రవాణా దారులు ఏ మాత్రం బయపడటం లేదు. దీని వలన ఆయా మండలాల నుంచి ఇసుకను నియోజకవర్గవ్యాప్తంగా తరలిస్తూ డబ్బులు దండుకుంటున్నారు.

చర్యలు తీసుకుంటాం



మండలంలో అనుమతులు లేకుండా ఇసుక అక్రమ రవాణా చేస్తే, ట్రాక్టర్లను సీజ్ చేయడంతో పాటు యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ఇసుక క్వారీ, డంప్ లేని విషయాన్ని ఉన్నతాధికారులు దృష్టికి తీసుకెళ్లి తీసుకెళ్తాం. ఇసుక అక్రమ రవాణాను నిరోధించడానికి పటిష్టమైన ఏర్పాట్లు చేశాం. నిబంధనలు పాటించని వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు.

-రవీంద్రారెడ్డి, తహసీల్దారు,
చాపాడు మండలం

బీజేపీ పాలనలోనే దళితులపై దాడులు అధికం

బద్వేలు అర్బన్ : 2014 కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మైనార్టీలు, దళితులు, మహిళలపై దాడులు పెరిగాయని సీపీఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్ పేర్కొన్నారు. స్థానిక సుందరయ్య భవనంలో నిర్వహించిన సీపీఎం పట్టణ కమిటీ శిక్షణా తరగతుల్లో ఆయన మాట్లాడుతూ 2024లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ స్వంత బలం కోల్పోయి ఎన్డీయే మిత్ర పక్షాల బలంపై ఆధారపడి అధికారంలోకి వచ్చిందన్నారు. బీజేపీకి దేశంలో రాజకీయ ప్రతిపక్షం కాంగ్రెస్ అయినప్పటికీ సైద్ధాంతిక ప్రత్యర్థులు వామపక్షాలే అని అన్నారు. జిల్లాతో పాటు బద్వేలు నియోజకవర్గంలో జరిగిన భూకబ్జాలపై జిల్లా కలెక్టర్ సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రామ్మోహన్, పట్టణ నాయకులు చిన్ని, మోక్షమ్మ, ఖైరున్‌బీ, ఆదిల్, ఇమ్మానియేల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

అట్లూరు : ప్రకృతి వ్యవసాయం లాభదాయకమని బద్వేలు వ్యవసాయ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.నాగరాజ పేర్కొన్నారు. బద్వేలు మండలం చింతలచెరువు రైతుసేవా కేంద్రం పరిధిలోని కొత్తపల్లె గ్రామంలో గొడ్లవీటి సుబ్బారావు చేపట్టిన ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని ఆయన గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా కాంప్లెక్స్ ఎరువులు, పురుగు మందుల వినియోగం తగ్గిపోవడంతో ఖర్చులు తగ్గి దిగుబడి పెరుగుతుందని తెలిపారు. అనంతరం చింతలచెరువు రైతుసేవా కేంద్రాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. రైతుసేవా కేంద్రం వ్యవసాయ సహాయకులు అనకర్ల పవన్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీదేవి

ప్రొద్దుటూరు : మున్సిపాలిటీ పరిధిలో పారిశుద్ధ్య పనులపై అధికారులు చర్యలు తీసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయ సభాభవనంలో గురువారం కౌన్సిల్ అత్యవసర సమావేశం మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి అధ్యక్షత జరిగింది. ఈ సందర్భంగా కమిషనర్ రఘునాథరెడ్డి మాట్లాడుతూ రూ.1.10 కోట్లతో ప్రధాన కాలువల్లో పూడిక తీత పనులను ప్రారంభించామన్నారు. కౌన్సిలర్ వరికూటి ఓబుళరెడ్డి మాట్లాడుతూ ప్రధాన కాలువల పూడికతీత పనులను కాలువ పైభాగం నుంచి మొదలు పెట్టాలని తెలిపారు. కౌన్సిలర్ గాజుల శివజ్యోతి మాట్లాడుతూ తన వార్డులో మసీదు పక్కన ఉన్న కాలువపై వేసిన గ్రిల్‌కు కాంక్రీట్ వేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. అనంతరం అజెండాలోని అంశాలను కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. మున్సిపల్ వైస్ చైర్మన్లు ఆయిల్‌మిల్ ఖాజా, పాతకోట బంగారు మునిరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం



ధ్యాన్‌చంద్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు

ప్రొద్దుటూరు కల్చరల్ : మండల పరిధిలోని ఆర్‌సీపీఈ కళాశాలలో గురువారం మేజర్ ధ్యాన్ చంద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ క్రీడాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ రవి శంకర్ ఒలంపిక్స్ హాకీలో భారతదేశానికి 8 సార్లు బంగారు పతకం సాధించడంలో ధ్యాన్ చంద్ కృషి ఎంతో ఉందన్నారు. హాకీ మాంత్రికునిగా ఖ్యాతి గడించిన ధ్యాన్ చంద్ క్రీడాకారులకు మార్గదర్శి అని, ఆయన గొప్పతనాన్ని కొనియాడారు. ఈ సందర్భంగా ధ్యాన్‌చంద్‌టీం, రూప్‌సింగ్ టీం మధ్య హాకీ పోటీ నిర్వహించారు. భాస్కర్‌రెడ్డి, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

క్రీడలకు అధిక బడ్జెట్ కేటాయించాలి

ప్రొద్దుటూరు : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు క్రీడలకు అధిక బడ్జెట్ కేటాయించి క్రీడారంగాన్ని అభివృద్ధి చేయాలని డీవైఎస్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ కోరారు. గురువారం జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా స్థానిక ఎస్వీ డిగ్రీ కాలేజీలో ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. రాష్ట్రంలో పీఈటీ, ఫిజికల్ డైరెక్టర్ల పోస్టులను భర్తీ చేసి ప్రతి పాఠశాలలో క్రీడా సామగ్రి అందించాలని డిమాండ్ చేశారు. డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు డేవిడ్, పట్టణ నాయకులు విశ్వనాథ్, రవి, శ్రీహరి పాల్గొన్నారు.

పోరుమామిళ్లలో ర్యాలీ

పోరుమామిళ్ల: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం పట్టణంలోని తైక్వాండో క్రీడాకారులు మాస్టర్ నాయబ్ రసూల్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ముఖ్య అతిథిగా సీఐ శ్రీనివాసులు పాల్గొని జండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అంతకు ముందు ధ్యాన్ చంద్ చిత్రపటానికి సీఐ శ్రీనివాసులు, మాస్టర్ నాయబ్ రసూల్ పూలమాల వేసి నివాళి అర్పించారు. జూనియర్ కళాశాల నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు నిర్వహించిన ఈ ర్యాలీలో తైక్వాండో విద్యార్థులు, జాతీయస్థాయి క్రీడాకారులు ఉస్మాన్, సుభాన్, నరసింహ, రోషన్, బాలు పాల్గొన్నారు.

ఎంబీఏతో ఉద్యోగాలు మెండు

ప్రొద్దుటూరు కల్చరల్ : ఎంబీఏ పూర్తిచేసిన విద్యార్థులకు ప్రభుత్వ, ప్రైవేటు రంగంలో ఉద్యోగ అవకాశాలు విస్తృతంగా లభిస్తాయని యోగివేమన యూనివర్సిటీ బిజినెస్ మేనేజ్‌మెంట్ విభాగం అధ్యాపకుడు డాక్టర్ వై.సుబ్బరాయుడు పేర్కొన్నారు. గురువారం సాయిరాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ కళాశాలలో ఎంబీఏ విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంబీఏ విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకుంటే ప్రభుత్వ, ప్రైవేటు రంగంతో పాటు పరిశ్రమల, మార్కెటింగ్, సాఫ్ట్‌వేర్ రంగాలలో ఉద్యోగాలు సులభంగా పొందవచ్చన్నారు. అధ్యాపకులు చెప్పే పాఠ్యాంశాలను శ్రద్ధగా విని బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీరకుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ వీరకల్యాణ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ పాండురంగన్‌రవి, వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరెడ్డి, ఎంబీఏ హెచ్‌ఓడీ షబానా బీ, హెచ్‌ఓడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు

భక్తిశ్రద్ధలతో మృత్యుంజయ హోమం

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక అగస్త్యేశ్వరాలయంలో గురువారం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా ఘనంగా మృత్యుంజయ హోమాన్ని నిర్వహించారు. వేకువజామున అగస్త్యేశ్వరస్వామికి మహాన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రాజరాజేశ్వరి అమ్మవారికి పంచామృతాభిషేకం, కుంకుమార్చనలు చేసి ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. అనంతరం లోకకల్యాణార్థం గణపతి, నవగ్రహ, ఉప దేవతా హోమాలు, మృత్యుంజయ హోమాలను వేదపండితుల ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా నిర్వహించారు. పూర్ణాహుతిగా హోమద్రవ్యాలు, పూజాద్రవ్యాలను అర్పించి భక్తిశ్రద్ధలతో పూజించారు.

పెరటి కోళ్ల పెంపకంతో ఆదాయం



పెరటి కోళ్లను అందజేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాస ప్రసాద్

ప్రొద్దుటూరు : పెరటి కోళ్ల పెంపకం వలన తక్కువ ఖర్చుతో అధిక ఆదాయం పొందవచ్చని పశువైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాస ప్రసాద్ తెలిపారు. మండలంలోని గోపవరం వద్ద ఉన్న పశువైద్య కళాశాలలో గురువారం పశుగణక్షేత్ర విభాగం వారు ఎస్సీ రైతుల సంక్షేమం కోసం పెరటి కోళ్ల పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ శ్రీనివాస ప్రసాద్ మాట్లాడుతూ పెరటి కోళ్ల పెంపకం ద్వారా కోడి గుడ్లు, మాంసం విక్రయంతో ఆదాయం పొందవచ్చన్నారు. పెరటి కోళ్లను ఎలా పెంచాలని, వాటి వల్ల కలిగే లాభాలపై రైతులకు అవగాహన కల్పించారు. అనంతరం ఒక్కొక్క మహిళా రైతుకు 8 ఆడ, 2 మగ కోళ్లను కలిపి మొత్తం 10 ఆసీల్ జాతి కోళ్లను 50 మంది రైతులకు పంపిణీ చేశారు.

పశువైద్య శిబిరం విజయవంతం

మైదుకూరు : మండలంలోని ఉత్సలవరంలో గురువారం నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరం విజయవంతమైంది. పశుగణాభివృద్ధి సంస్థ సహకారంతో, పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరాన్ని సర్పంచ్ జయభారత్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కడప పశుగణాభివృద్ధి సంస్థ కార్యనిర్వహణాధికారి డాక్టర్ జి.రమేష్ మాట్లాడుతూ సీజనల్ వ్యాధుల పట్ల పాడి పశువుల రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రభుత్వం పెయ్యదూడల సూదుల పథకం కింద రూ.1850 విలువైన మందును రూ.850 సబ్సిడీపోను రూ.500కే అందిస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శిబిరంలో 12 చూడి పశువులకు, 24 పశువులకు గర్భకోశ వ్యాధులకు, 78 పశువులకు సాధారణ చికిత్సలు అందించారు.

మధురమైన తెలుగు మనదేనోయ్



బద్వేలు అర్బన్: ర్యాలీ నిర్వహిస్తున్న భాషాభిమానులు



చాపాడు: ఐడీపీఎస్‌లో తెలుగు భాష గొప్పతనంపై విద్యార్థుల వేషధారణలు



మైదుకూరు : దాసరి రామును సత్కరిస్తున్న ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి, అధ్యాపకులు

బద్వేలు అర్బన్ : మధురమైన తెలుగు మనదేనోయ్ అని రాష్ట్రపతి అవార్డు గ్రహీత, తెలుగు భాష వికాస ఉద్యమ జిల్లా అధ్యక్షులు విద్వాన్ డాక్టర్ గానుగపెంట నుమంతరావు పేర్కొన్నారు. మానవ జీవితాలకు వెలుగు తెలుగు భాష అని కొనియాడారు. మాతృభాష దినోత్సవం సందర్భంగా గురువారం మొల్ల సాహితీ పీఠం, భాగ్యరత్న ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులు, భాషాభిమానులు స్థానిక నాలుగు రోడ్ల కూడలి నుంచి ఎన్‌జీఓ హోం వరకు ర్యాలీ నిర్వహించారు.

ఆకట్టుకున్న అష్టావధానం

మాతృభాషా దినోత్సవ వేడుకల్లో భాగంగా స్థానిక ఎన్‌జీఓ హోంలో కడపకు చెందిన వేద పండితులు బ్రహ్మశ్రీ మాడుగులశివశ్రీశర్మ ఆధ్వర్యంలో నిర్వహించిన అష్టావధానం ఆకట్టుకుంది. డాక్టర్ హనుమంతరావు అధ్యక్షత వహించగా తహసీల్దారు ఉదయభాస్కర్‌రాజు, ఎంపీడీఓ రామకృష్ణయ్య, ప్రధానోపాధ్యాయుడు జి.వి.సుబ్బారెడ్డి తదితరులు పృచ్ఛకులుగా వ్యవహరించారు. వైవీయూ పాలక మండలి సభ్యులు కె.సి.సుబ్బారావు, అర్బన్ ఎస్ఐ సత్యనారాయణ, వెంకటేశ్వర్లు, గురుమూర్తి పాల్గొన్నారు.

తెలుగు భాషాభివృద్ధికి కృషి చేయాలి

మైదుకూరు : తెలుగు భాషాభివృద్ధికి ప్రభుత్వాలు కృషి చేయాలని వక్తలు పేర్కొన్నారు. మైదుకూరులోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గురువారం ప్రిన్సిపాల్ డాక్టర్ పి.నారాయణరెడ్డి అధ్యక్షతన తెలుగు అధ్యాపకురాలు అనురాధ లక్ష్మి తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహించారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

ప్రొద్దుటూరు : మండలంలోని కొత్తపల్లె గ్రామ పంచాయతీ మీనాపురం గ్రామ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో గురువారం తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. వ్యవహారిక భాష పితామహుడు గిడుగు రామమూర్తి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళి అర్పించారు. రాష్ట్ర ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, పాఠశాల ఉపాధ్యాయుడు గజ్జల వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ వ్యవహారిక భాషోద్యమ నాయకుడు గిడుగు రామమూర్తి జయంతిని తెలుగు భాషా దినోత్సవంగా నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు.

పోరుమామిళ్ల: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ ప్రకాష్‌రావు అధ్యక్షతన గురువారం తెలుగుభాషా దినోత్సవం నిర్వహించారు. తెలుగుభాష గొప్పతనం, ఔన్నత్యం, తియ్యదనం గురించి తెలుగు అధ్యాపకులు కల్యాణ్‌కుమార్, మహమ్మద్‌రఫీ, సులోచన, శ్రీధర్‌మూర్తి మాట్లాడారు.

కలసపాడు : మండలంలోని కట్టక్రిందిపల్లె ప్రాథమిక పాఠశాలలో గురువారం ప్రధానోపాధ్యాయుడు కల్లూరి రామకృష్ణారెడ్డి, జన విజ్ఞానవేదిక జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్.ఖాశీంవల్లి ఆధ్వర్యంలో ఘనంగా గిడుగు రామ్మూర్తి జయంతి వేడుకలు నిర్వహించారు.

చాపాడు: స్థానిక ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో గురువారం తెలుగు భాష, క్రీడా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు భాష గొప్పతనం గురించి ఉపాధ్యాయులు వివరించారు. ఈ సందర్భంగా తెలుగు భాష గొప్పతనంపై విద్యార్థులు వివిధ వేషధారణల్లో ఆకట్టుకున్నారు.